తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

గురువారం 04 జూన్ 2026

పేజీలు : 8

Follow :




## ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమాల నిర్వహణ

### ○ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10వ తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వేబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వీటిని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, గ్రామ సభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభల షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ వర్షాకాలంలో జిల్లాలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం నమోదయ్యే ఆస్కారం ఉందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం ఎక్కువగా పండుతుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహించాలన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు గ్రామ సభల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తారని తెలిపారు.
జూలై 31న ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణ జరుగుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, నోటీసుల జారీ ఉంటుందని వివరించారు. అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తారని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా గ్రామస్థాయిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మ్యాజిక్ సోక్ పిట్స్, జల సంరక్షణ, వన సంరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బడి బాట కార్యక్రమంపై గ్రామ సభల్లో ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు. గ్రామాల్లోని పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిఈఓ అశోక్, డిఐఈఓ సులోచన, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన పీపీఏ బృందం

### పోలవరం బ్యాక్ వాటర్తో ముప్పు వాటిల్లే ప్రాంతాల్లో పర్యవేక్షణ

**బూర్గంపహాడ్ జూన్ 03 (జనంసాక్షి)**
పోలవరం ప్రాజెక్టు పూర్తయితే బ్యాక్ వాటర్తో తెలంగాణలోని గోదావరి తీరప్రాంతాల్లో ప్రభావం కలిగించే పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందం(పీపీఏ) బుధవారం మండలంలో పర్యటించింది. తొలుత ఐటీసీ గెస్ట్హౌస్కు చేరుకున్న బృందం స్థానికంగా ఉన్న కేంద్ర జలసంఘం, నీటిపారుదల విభాగం అధికారులతో సమీక్షించి అనంతరం బూర్గంపహాడ్ మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని కొల్లు ప్రాంతంతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో రెండు ప్రాంతాల్లో పర్యటించి ముంపునకు గల కారణాలపై అధ్యయనం చేశారు. అదేవిధంగా అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్ను బృందం సందర్శించి అక్కడ వరద ప్రవాభం ఏ మేరకు ఉందో అక్కడి వారిని అడిగి తెలుసుకుని అధ్యయనం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావం ఎక్కడెక్కడ ఉంటుందో ఆ ప్రాంతాల్లో పర్యటిస్తూ అధ్యయనం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ తో ప్రధానంగా బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలకు సమస్య ఉందని, అటు భద్రాచలం, దుమ్ముగూడెం ప్రాంతాల్లో బ్యాక్ వాటర్ ప్రభావం ఎక్కువగా ఉండి మిగతా 3లో

## పాడైపోయిన మిషన్ భగీరథ పంపింగ్ వాల్

### పట్టించుకోని అధికారులు

సమస్యలు ఉన్నచోట భగీరథ అధికారుల జాడేది

15 రోజులుగా వాటర్ ట్యాంక్ కు ఆగిపోయిన వాటర్ పంపింగ్

**పెనుబల్లి జూన్ 3 (జనంసాక్షి)**
మిషన్ భగీరథ పంపింగ్ వాల్ పాడైపోయి గత 15 రోజులైనా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అధికారులపై మండిపడుతున్నారు. పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామపంచాయతీ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పంపింగ్ వాల్ ఆగిపోయి గ15 రోజులుగా భగీరథ నీరు వాటర్ ట్యాంక్ కు ఎక్కడం లేదు, గ్రామ పంచాయతీ నీటి సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు మిషన్ భగీరథ నీళ్లు ఈ పంపింగ్ వాల్ ద్వారా వాటర్ ట్యాంకు ఎక్కించడం జరుగుతుంది. వేసవిలో గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చేయాలని ప్రభుత్వం, ఉన్నత శాఖాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ మిషన్ భగీరథ అధికారులు మాత్రం గ్రామాలలో ఏర్పడిన సమస్యల పట్ల కనీసం స్పందించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు మిషన్ భగీరథ అధికారులు ఉన్నారా లేరా వారి అడ్రస్ ఎక్కడ అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులపై అజమాయిషి లేకపోవడం వల్లే గ్రామాల్లో భగీరథ అధికారులు ఉనికి లేదని తీవ్ర ఆరోపణలు వినవస్తున్నాయి. జనం సాక్షి పత్రికలో గతంలో మిషన్ భగీరథ పైపుల లీకులు వల్ల జరుగుతున్న నీటి కలుషితంపై, ఇదే పంపింగ్ వాల్ మురుగుగుంట లో ఉన్నదని, డ్రైనేజీ నీరు వాల్ లోకి పోయి నీరు కలుషితం అవుతున్నాయని, పలు కథనాలు వచ్చినప్పటికీ భగీరథ అధికారులు కనీసం స్పందించలేదు. వార్తాపత్రికల్లో సమస్యలపై ఎన్ని కథనాలు వచ్చినా భగీరథ అధికారులు సమస్యల పట్ల వ్యవహరిస్తున్న తీరును బాధ్యతారాహిత్యనీ అనుకోవాలా, మమ్మల్ని ప్రశ్నించే నాధుడు లేరని అనుకుంటున్నారా, అనేది అర్థం కావట్లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





సంఘటనా స్థలం

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలి..

### కరెంట్ తీగలు తగిలి యువకుడు దుర్మరణం!

### కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం..

**చండూరు, జూన్ 3 (జనంసాక్షి)**
నల్గొండ జిల్లా చండూరు మండల పరిధిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలియైంది. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడంలో అధికారులు చూపిస్తున్న ఉదాసీనత వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఇటువంటి ఘోర ప్రమాదమే చండూరు మండల పరిధిలోని చొప్పరి వారి గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్న ఒక యువకుడు కరెంట్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పరి వారి గూడెం గ్రామానికి చెందిన చొప్పరి చందు (20) అనే యువకుడు తన పొలం వద్దకు వెళు తుండగా, మార్గమధ్యంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు అతనికి తగిలాయి. కరెంట్ షాక్ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చందు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వ్యవసాయ బావుల వద్ద గత కొన్ని రోజులుగా విద్యుత్ తీగలు చేతికి అందేంత తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, వారు ఎంతమాత్రం పట్టించుకోలేదని స్థానికులు మిగతా 3లో

# పోలవరం బ్యాక్వాటర్ ప్రభావంతో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల ప్రజలకు ముప్పు

## పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందానికి బూర్గంపహాడ్, అశ్వాపురం బీఆర్ఎస్ నేతల వినతి



**బూర్గంపహాడ్ జూన్ 03 (జనంసాక్షి)**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం, పినపాక నియోజకవర్గం ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని... 86లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సంభవిస్తే పోలవరం బ్యాక్ వాటర్తో ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు, వ్యవసాయభూములు, ప్రభుత్వ, జాతీయ ప్రాధాన్యత సంస్థలకు తీవ్రనష్టం ఏర్పడే అవకాశం ఉందని గురువారం సారపాక ఐటీసీ అతిథిగృహానికి చేరుకున్న పోలవరం అథారిటీ బృందాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నాయకులు కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు 12 అంశాలతో కూడిన లేఖను వారికి అందించి ఆ లేఖలోని ప్రధాన డిమాండ్లను తెలంగాణ ప్రజల హక్కులు, భద్రత, భవిష్యత్తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలుచేయాలని కోరారు. ప్రధానంగా సమగ్ర బ్యాక్ వాటర్ అధ్యయనాన్ని తక్షణం నిర్వహించాలని, 36 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద ప్రవాహాన్ని ప్రామాణికంగా తీసుకుని స్వతంత్ర జాతీయ లేదా అంతర్జాతీయ నిపుణ సంస్థలతో కొత్త బ్యాక్ వాటర్ అధ్యయనం నిర్వహించి ఆ అధ్యయన నివేదిక పారదర్శకతతో ప్రజల ముందుంచాలని, తెలంగాణ ముంపు గ్రామాలకు ప్రత్యేక ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని, ప్రతి ముంపుబాధిత కుటుంబానికి ఏపీలో అమలవుతున్న ప్యాకేజీతో సమానంగా లేదా అంతకంటే మెరుగైన పునరావాస, పునఃనిర్మాణ ప్యాకేజీని కేంద్రం ద్వారా అమలుచేయాలని, భూములు కోల్పోయిన రైతులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు ప్రత్యేక పరిహారం ఉండాలని, పోలవరం ఆపరేషనల్ రూల్ కర్వను సవరించాలని, వరదకాలంలో ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టాన్ని నిల్వచేయకుండా రన్ ఆఫ్ ద రివర్ విధానం అమలుచేయాలని, జూలై నుంచి ఆగస్టు వరకు అవసరమైన సమయంలో గేట్లు ఎత్తి వరదనీటి ప్రవాహాన్ని నిరాటంకంగా దిగువకు విడుదల చేయాలని, పోలవరం డిజైన్, స్పిల్ వే సామర్థ్యం పునఃసమీక్షించాలని, కిన్నెరసాని, ముర్రేడు వాగులపై ప్రత్యేక అధ్యయనం చేయాలని, భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు పినపాక నియోజకవర్గంలో కొత్త ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని, పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా నియోజకవర్గంలోని బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలు తీరమండలాలు కావడంతో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, గ్రామాల్లో వ్యవసాయ భూములు, ప్రజల ఆస్తుల రక్షణ కోసం కొత్తగా రక్షణ గోడలు పోలవరం ప్రాజెక్టు వ్యయంతో నిర్మించాలని, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ కు ప్రత్యేక భద్రత కల్పించాలని, భద్రాచలం డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, గోదావరిలో భారీస్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపట్టడంతో పాటు తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అమలు అమలు చేయవద్దనే డిమాండ్లతో రక్షణ చర్యలన్నింటినీ పోలవరం ప్రాజెక్టు కాంపోనెంట్లలో చేర్చాలని పీపీఏకు విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, కోడి అమరేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు వెన్న అశోక్ కుమార్, కంచుగట్ల వీరభద్రం, గొర్రెముచ్చు వెంకటరమణ, శివారపు డాక్టర్బాబు, బూర్గంపహాడ్ మండల నాయకులు కర్రి నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బొబ్బిలి, దాసు, గోపికృష్ణ, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## పేదరికం పోయి అభివృద్ధి చెందాలంటే మాదిగలు చదువులో ముందుండాలి..

**కనగల్లు, జూన్ 3 (జనంసాక్షి)**

పేదరికంలో నుంచి మాదిగలు సమాజంలో అభివృద్ధి చెందాలంటే మాదిగ సామాజిక వర్గంలోని ప్రతిబిడ్డ చదువులో ముందుండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మండల ఇన్చార్జి ఇ రిగి శ్రీశైలం మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. సమావేశానికి ఇ రిగి శ్రీశైలం మాదిగ హాజరై మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ లో వివిధ హోదాలో పనచేస్తున్న బాధ్యులు 40 రోజుల కార్యక్రమాన్ని రూపొందించుకొని జులై ఏడు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం రోజు నాటికి ప్రతి మాదిగ పల్లెకు వెళ్లి సామాజిక వర్గములోని బడే ఈడు కొచ్చిన పిల్లలతోపాటు మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి వారు పాఠశాలలో చేరే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. మాదిగల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దశల వారి పోరాటాల ఫలితంగా అందిన రిజర్వేషన్ ఫలాలను అందాలంటే ప్రతి ఇంట్లో చదువే ప్రధాన కర్తవ్యం గా భావించి చదువుకోవాలని సూచించారు. ప్రతి మాదిగ పిల్లవాడు ఉన్నత విద్యను పొంది ఆ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అతను ఓ భాగస్వామిగా మిగులుతాడని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కందుల మోహన్ మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు దుబ్బ సత్యనారాయణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మండల నాయకులు అందుగుల బిక్షం, అందుగుల వెంకటేశం, బిక్షపతి, శ్రీను, శంకర్, దాసరి కిరణ్, బొజ్జ సైదులు, రాజేష్ తదితరులు ఉన్నారు.

## జాతీయ భవన నిర్మాణ మండల ప్రధాన కార్యదర్శిగా గూని సురేష్



**భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (జనంసాక్షి):**

జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం భూదాన్ పోచంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి గ్రామానికి చెందిన గూని సురేష్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్లోని వనస్థలిపురంలో నిర్వహించిన జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బి. అనంతయ్య సమక్షంలో జాతీయ చైర్మన్ కొల్లిశెట్టి లక్ష్మయ్య చేతుల మీదుగా గూని సురేష్కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గూని సురేష్ను పోచంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దంగుల బాలరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు స్వామి, పోచంపల్లి మండల అధ్యక్షులు కరగల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**పాలక వీడు (జనంసాక్షి):**

. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేదల పాలిట దేవుడిలా మంత్రి ఉత్తమ్ నిలిచారని బెట్టతండా సర్పంచ్ మాలోత్ బుజ్జి మోతిలాల్ కొనియాడారు. బెట్టెతండా గ్రామానికి చెందిన దీరావత్ రాజేష్ కు మంత్రి ఉత్తమ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.50 వేల చెక్కును బుధవారం బాధిత రాజేష్ తండ్రి నాగేశ్వరరావుకు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రి ఖర్చులకు అప్పులు చేసి తల్లడిల్లుతున్న అనేకమందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కోరిన వెంటనే పరిహారం అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్న మంత్రి ఉత్తమ్ కృషి మరవలేనిది అన్నారు. ఈ సందర్భంగా బాధితుని పక్షాన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో

# గడ్డం యాదగిరి జన్మదిన వేడుకలు



**రామన్నపేట, జూన్ 3 (జనంసాక్షి):**

తెలంగాణ ఉద్యమకారుడు టీపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర సెక్రటరీ గడ్డం యాదగిరి 53వ జన్మదిన వేడుకలను ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రామన్నపేట పట్టణ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న పాల్గొని గడ్డం యాదిగిరిని సాల్వతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి గౌరవాధ్యక్షులు పోతరాజు శంకరయ్య గడ్డం యాదిగిరిని సాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యావేత్త ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె చాంద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో గడ్డం యాదగిరి పల్లివాడ గ్రామం నుంచి రామనపేట మండల కేంద్రంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తి అని కొనియాడారు. రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మాట్లాడుతూ. రామన్నపేట నియోజకవర్గం ఏర్పడాలని ఒక ఉద్యమకారునిగా పోరాటం చేసిన వ్యక్తి గడ్డం యాదగిరి అని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న మాట్లాడుతూ చిందు సామాజిక వర్గానికి చెందిన గడ్డం యాదగిరి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 57 ఉపకులాల కోసం పోరాటం చేయడంలో ముఖ్యపాత్ర వహించారన్నారు. గడ్డం యాదగిరి 53వ జన్మదిన సందర్భంగా టిపిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ ఒక చిందు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీగా నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు 57 ఉపకులాల రాష్ట్ర అధ్యక్షులు బైరి వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్ మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి లీగల్ సెల్ అడ్వైజర్ ఉద్యమకారుడు కూనూరు శ్రీనివాస్ ఉద్యమ నాయకులు కొండ మల్లేశం గౌడ్, కైరం కొండ సంతోష్, ఏలూరు రవి, బాలయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వేగవంతమైన జీవితంలో మనిషి శారీరక, మానసిక ఒత్తిడులతో సతమతమవుతున్నాడు. ఈ సమస్యలకు సహజమైన పరిష్కారంగా యోగా నిలుస్తోంది. వేల ఏళ్ల భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు.. శరీరం, మనస్సు, ఆత్మల సమన్వయానికి దారి చూపే జీవన విధానం. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 2022 ఏప్రిల్ 14న ఉచిత సమ్మర్ యోగ క్యాంపుగా ప్రారంభమైన యోగ శిక్షణ కార్యక్రమం ప్రస్తుతం ఆరోగ్య చైతన్యానికి వేదికగా మారింది.

భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (జనంసాక్షి)



# ఆరోగ్య చైతన్య వేదికగా యోగా

- స్ఫూర్తిగా నిలిచిన బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్
- ఆరోగ్యానికి మార్గం, జీవితానికి దిక్సూచి ఈ సాధన
- భూదాన్ పోచంపల్లిలో ఉత్సాహంగా కొనసాగుతున్న శిక్షణ

యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలనే లక్ష్యంతో యోగ శిక్షకురాలు కొయ్యడ సంధ్యా కాశీనాథ్, డా. సీత భాస్కర్, కొయ్యడ లింగస్వామి, కేమా విష్ణు, కొండమడుగు మల్లేష్, చింతల రామకృష్ణ, చింతకింది కిరణ్, జీనుకల యాదగిరి, నల్ల నగేష్, దోర్నాల బాలరత్నం, కడవేరు చంద్రశేఖర్, సీత కృష్ణ, కొంగరి ప్రకాష్, వీడేం రామనాథం, విష్ణు, స్కైలాబ్, సిలువేరు బాలనర్సింహా, ఈపూరి ముత్యాలు, కర్నాటి బాలరాజు, సిరిమల్లె పరమేష్, కటిక ఐలయ్య, చింతల రామచంద్రం తదితరులు కమిటీగా ఏర్పడి బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్‌ను స్థాపించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మండలంతో పాటు జిల్లాలో మంచి గుర్తింపు పొందుతున్నారు. యోగ శిక్షకురాలు కొయ్యడ సంధ్యా కాశీనాథ్ పలువురికి యోగ శిక్షణ అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఒక మహిళగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే యోగ సాధనలో ముందుంటూ యువత, మహిళలు, వృద్ధులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు క్రమం తప్పకుండా ఉచిత యోగాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యోగ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతూ ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించాలని సూచిస్తున్నారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ యోగ క్యాంపు ప్రస్తుతం అనేక మందిని ఆకర్షిస్తూ ఆరోగ్య అవగాహన కల్పించే వేదికగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

## యోగా ఆరోగ్యకరమైన జీవనశైలి

సంస్థ అధ్యక్షులు డా. సీత భాస్కర్



ప్రస్తుత జీవనశైలిలో ఉరుకులు పరుగుల జీవితంతో గుండె పోటు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యోగ చేయడం వల్ల ఇలాంటి వ్యాధులను కొంతవరకు నివారించవచ్చు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. యోగ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడేందుకు దోహదపడుతుంది.

**ప్రతిరోజూ** యోగ చేయడం వల్ల శారీరకంగా ఫిట్‌గా ఉండటంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తోంది. యోగ మా దైనందిన జీవితంలో భాగమైంది. యోగ ప్రారంభించే ముందు నా బరువు 86 కిలోలు ఉండేది, క్రమం తప్పకుండా యోగ చేయడంతో ఇప్పుడు 78 కిలోలకు తగ్గింది. యోగ వల్ల బరువు తగ్గడమే కాకుండా శరీరంలో ఉత్సాహం, చురుకుదనం కూడా పెరిగాయి.

**- కొయ్యడ లింగస్వామి**



**ఉదయం యోగ చేయడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటున్నాం. ఉచితంగా ఇలాంటి శిక్షణ అందించడం అభినందనీయమైన విషయం.**

**- చింతల రామకృష్ణ**



**యోగ సాధన** ప్రారంభించిన తర్వాత ఆరోగ్యపరంగా మంచి మార్పులు కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ యోగ చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తోంది. బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత యోగ శిక్షణ మరింత మందికి ఉపయోగపడుతోంది.

**- కొండమడుగు మల్లేష్**

## మరింత విస్తరించడమే లక్ష్యం

కొయ్యడ సంధ్యా కాశీనాథ్, యోగ శిక్షకురాలు



యోగ నా జీవితంలో ఒక సాధన మాత్రమే కాదు, ఒక సేవా మార్గం కూడా. యోగలో అనేక, సర్టిఫికెట్లు పొందడం ద్వారా యోగపై మరింత అవగాహన పెంచుకున్నాను. శిక్షకురాలిగా మహిళలు, యువత, పిల్లలు, వృద్ధులకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాను. యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నా. దీనిని ప్రజల్లో మరింత విస్తరించడమే లక్ష్యం.

**ప్రతిరోజూ** యోగ చేయడం వల్ల శరీరం చురుకుగా ఉండటంతో పాటు ఆరోగ్యపరంగా మంచి మార్పులు కనిపిస్తున్నాయి. యోగ చేయడం అలవాటుగా మారి ఇప్పుడు రోజువారీ జీవితంలో భాగమైంది.

**- బావండ్ల రాజు**



## మృతుల కుటుంబాలకు అండగా

# మంత్రి పొంగులేటి

**❑పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 40 కుటుంబాలకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం**

**❑బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన కాంగ్రెస్ నాయకులు**



**ఖమ్మం రూరల్, జూన్ 03 (జనం సాక్షి):** కుటుంబ పెద్దను కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేకపోయినా, ఆ కష్ట సమయంలో అందించే చేయూత ఆ కుటుంబానికి కొంత ఊరటనిస్తుంది. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 40 బాధిత కుటుంబాలకు రాష్ట్ర మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28, 29, 30 (వరంగల్ క్రాస్ రోడ్డు), 31, 32 (ఏదులాపురం పాత ఊరు) వార్డుల్లో ఇటీవల వివిధ కారణాలతో 40 మంది మృతి చెందగా, వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, వార్డు నాయకులు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ, వారి బాధలో తాము కూడా భాగస్వాములమేనని తెలిపారు. కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధ నుంచి తేరుకోలేని పరిస్థితుల్లో తమను గుర్తించి పరామర్శించడం, ఆర్థిక సహాయం అందించడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేసిన సహాయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, వెంపటి సురేష్, వెంపటి రవి, అజ్మీరా అశోక్, పొన్నేకంటి నరసింహారావు, పొన్నేకంటి నారాయణ, ఏపూరి తరుణ్, వీరబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### పిఎసిఎస్ కొనుగోలు కేంద్రంలో తూకాలలో, తరుగుల పేరుతో

## మాయాజాలం బాధిత రైతుల ఆవేదన

### దోపిడీపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన రైతులు

**పెన్‌పహాడ్, జూన్ 3 (జనంసాక్షి) :** మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారని బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతుల సంతకాలను వారి అనుమతి లేకుండా సిబ్బందే ఫోర్జరీ చేసి కొనుగోలు పత్రాలను చాలా రోజుల తర్వాత అందిస్తున్నారని ఆరోపించారు.

యాసంగి-2026 సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో బస్తాకు అదనంగా 2 కిలోల వరకు తరుగు తీస్తున్నారని, కొనుగోలు పత్రాలు, రవాణా బిల్లులు, మిల్లుల రశీదుల మధ్య భారీ తేడాలు ఉన్నాయని, తూకాల్లో కూడా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. అదేవిధంగా హమాలీ, రవాణా చార్జీల పేరుతో ప్రతి క్వింటాపై రూ.57.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు.

ఈ విధంగా రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతోందని, ఇలాంటి ఘటనలు ఒక్క రైతుకే కాకుండా పలువురు బాధిత రైతులకు జరిగాయని పేర్కొన్నారు. పిఏసిఎస్ అధికారులు, సంబంధిత రైస్ మిల్లర్లపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని అనంతారం పిఏసిఎస్ బాధిత రైతులు జినకల నాగార్జున, డి. చెన్న కృష్ణయ్య, వి. కిషోర్ రెడ్డి, ఓర్సు ముత్తయ్య లు జిల్లా కలెక్టర్‌ను కోరారు...

## చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు శిక్ష



**కోదాడ(జనంసాక్షి):** చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఆరు నెలలజైలు శిక్ష విధిస్తూ కోదాడ కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. కోర్టు వివరాల ప్రకారం 2016వ సంవత్సరంలో కోదాడ పట్టణానికి చెందిన కర్నాటి అశోక్ వద్ద నుంచి ఎలగందుల శ్రీనివాసరావు రూ. 11 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ మొత్తానికి అశోక్‌కు చెక్ ఇచ్చాడు. అయితే, ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో తగినంత సొమ్ము లేకపోవడంతో బౌన్స్ అయింది. దీనిపై?బాధితుడు కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసరావుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు, చెక్ మొత్తమైన రూ. 11 లక్షలను బాధితుడికి చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ మొత్తాన్ని నెల రోజుల్లోగా చెల్లించని పక్షంలో, అదనంగా మరొక నెల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### తెట్టెలపాడు బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిర్రా కృష్ణయ్యను పరామర్శించిన బి ఆర్ ఎస్ శ్రేణులు



**తిరుమలాయపాలెం జూన్ 3 (జనంసాక్షి)** ఇటీవల వడదెబ్బకు గురై వారం రోజులు పాటు ఖమ్మం ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొంది డిశ్చార్జి అయి తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిర్రా కృష్ణయ్య ను బుధవారం బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బిల్లగిరి ధనుంజయ్ గీత కార్మిక మోటు దెబ్బ మండల కమిటీ అధ్యక్షులు రెడ్డి మల్ల నరేందర్ గ్రామ సర్పంచ్ చిర్రా నర్సమ్మ తోర్రికొండ వెంకటనారాయణ గుంటి పుల్లయ్య బిల్లగిరి వెంకటేశ్వర్లు వంగూరు మధుబాబు పగిడిపల్లి బాబు ఈర్ల ఈశ్వర్ చిర్రా కృష్ణ యని పరామర్శించి మనోధర్యంగా ఉండాలని కోరారు.

# ఫిట్‌నెస్ లేని బడి బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్ :ఎం వి ఐ

**❍మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య,**

**❍రోడ్డు భద్రతపై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం..**

**❍బస్ ఎక్కిన ప్రతి ఒక్కరిని గమ్య స్థానానికి చేర్చే బాధ్యత డ్రైవర్లదే..**





**మణుగూరు, జూన్ 03 జనంసాక్షి:** ఫిట్‌నెస్ లేని బడి బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తామని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం మణుగూరు స్నేహ గార్డెన్స్‌లో మణుగూరు డివిజన్ పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు అరవింద్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరు మాట్లాడారు..

పిల్లలు తల్లిదండ్రుల, దేశ భవిష్యత్తు అని, వారి భద్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయకులతో పాటు రవాణా శాఖపై కూడా ఉందని అన్నారు. విద్యా సంస్థలకు చెందిన వాహనాలు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. యాజమాన్యం ప్రతినిధులు, స్కూల్ బస్సు డ్రైవర్లు మరియు సహాయకులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**అర్హత అనుభవం కలిగిన చోదకులు:**

బడి బస్సు వాహన చోదకులకు కనీసం ఐదు సంవత్సరాల అనుభవం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించకూడదని పేర్కొన్నారు.

వాహన చోదకులు అర్హత అనుభవం ఆలోచన సరిగ్గా ఉంటే అనేక ప్రమాదాలు నివారించవచ్చు. వారిని యాజమాన్యం, తల్లితండ్రులు అనవసర విషయాల్లో ఒత్తిడి గురి చేస్తే వారు చేసే పనిలో ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. డ్రైవర్ తన మానసిక స్థితిని సమతుల్యంగా ఉంచుకొని, రోడ్డు పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, వాహనం కండిషన్, ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత అలవాట్లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సరైన నిర్ణయాలు తీసుకుంటే అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, నిద్రమత్తులో వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, కోపం, ఆందోళన లేదా ఇతర ఆలోచనలతో వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం వంటి అంశాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. డ్రైవర్ అప్రమత్తత, ఓర్పు, క్రమశిక్షణ బాధ్యతాయుతమైన నిర్ణయాల ద్వారా తన ప్రాణాలతో పాటు తోటి ప్రయాణికుల విలువైన ప్రాణాలను కూడా కాపాడగలడని పేర్కొన్నారు.

**బడి బస్సులకు ప్రత్యేక నిబంధనలు:**

విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి విద్యా సంస్థ బస్సు రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా బడి బస్సులు నడపాలని తెలిపారు.

ప్రతి బస్సుకు చెల్లుబాటు అయ్యే (ఫిట్‌నెస్) సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ (పి యు సి) ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్, జీపీఎస్, అత్యవసర సంప్రదింపు వివరాలు వంటి భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల బస్సులను విద్యార్థుల రవాణాకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో అటెండెంట్ అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు. వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

**అరైవ్ అలైవ్:**

రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అరైవ్ అలైవ్:" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమేనని సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనివల్ల ఇటు తల్లి తండ్రులు మానసిక శోభ అటు యాజమాన్యం నష్టం జరుగుతోంది. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

ప్రతి ఉదయం బస్సులో ఎక్కే విద్యార్థి సాయంత్రం క్షేమంగా తన ఇంటికి చేరుకోవడంలో తల్లి తండ్రులు, యాజమాన్యం బాధ్యతగా ఉండాలని తెలిపారు. పిల్లల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎమ్ అరవింద్ కుమార్, జి. మధు సూదన్ రెడ్డి, ఎం డి. ఈసబ్ షరీఫ్, ప్రతాప్ రెడ్డి, ఐజాక్ థామోస్, శ్రీనివాస్, చంద్ర మౌళి, సంపత్ రెడ్డి, జానిమియా ఖాన్, రామన్ రెడ్డి, నరేందర్ డ్రైవర్లు, సహాయకులు, రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.

# రఘువర్ధన్ రావు ఉపాధ్యాయ జీవితం సమాజానికి ఆదర్శం:ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



**నాంపల్లి,జూన్ 3 (జనంసాక్షి)**

నాంపల్లి మండలంలోని రేక్యాతండ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గా పని చేసి నేడు పదవీవిరమణ పొందుతున్న మర్రు రఘువర్ధన్ రావు ఉపాధ్యాయ జీవితం సమాజంతో ముడిపడి ఉందని వారు నేటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి సమీపంలోని ధన్వి కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ఉద్యోగ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడినారు ఉపాధ్యాయ జీవితంలో వేలాది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం లో రఘువరన్ రావు సేవలు అమోఘమైనవని అంతేకాక పిఆర్టియు సంఘానికి అందించిన సేవలు ఎన్నడూ మరువలేనివని కొనియాడారు.నాంపల్లి మండల శాఖ అధ్యక్షునిగా కీలక పాత్ర పోషించి సంఘ బలోపేతానికి కృషి చేశాడని గుర్తు చేశారు. అనంతరం పూలమాలలతో రఘువర్ధన్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం నాంపల్లి మండల శాఖ పిఆర్టియు ఆధ్వర్యంలో సమన్వయకర్తగా బాలాజీ వ్యవహరించగా సభాదీక్షత నక్క యుగేందర్ వహించారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి ఓ రాష్ట్ర కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, నల్గొండ జిల్లా పిఆర్టియు అధ్యక్షులు కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు తిరందాసు సత్తయ్య, నల్గొండ జిల్లా పి ఆర్ టి యు మాజీ అధ్యక్షులు పనీ కుమార్, నాంపల్లి ఎంపీడీవో శర్మ, నాంపల్లి ఎంఈఓ మల్లికార్జునరావు, ఎస్ టి ఓ ప్రసన్నకుమార్, చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు, కొండమల్లేపల్లి ఎంఈఓ నాగేశ్వరరావు, నాంపల్లి హైస్కూల్ జిహెచ్ఎం అజయ్ కుమార్, రాష్ట్ర అకాడమిక్ గైడెన్స్ కమిటీ వైస్ చైర్మన్ నక్క యుగంధర్, నాంపల్లి మండల పి ఆర్ టి యు గౌరవ అధ్యక్షులు కర్నాటి అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు



## అడిషనల్ ఎస్పీ భుజంగరావు మామ ఇంట్లో ఏసీబీ సోదాలకు వచ్చిన అధికారులు

**తుంగతుర్తి జూన్ 3 (జనంసాక్షి)**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో ఫోన్ టాపింగ్ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉండి సస్పెన్షన్ లో ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు మామ రిటైర్డ్ ఏ సి పి దుగ్యాల రాజేశ్వరరావు ఇంట్లో బుధవారం ఉదయమే అధికారులు సోదాలు నిర్వహించేందుకు వచ్చారు. అట్టి ఇంటికి తాళం వేసి ఉండడంతో ఒక అర గంట వేచి చూసిన అనంతరం తిరిగి వెళ్లారు, ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటిలో ఎవరూ లేరని ఇంటికి తాళం వేసి ఉండటంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేకపోయామని తదుపరి విచారణ చేయనున్నట్టు పేర్కొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పథకానికి

# దరఖాస్తుల ఆహ్వానం

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**

సూర్యాపేట జిల్లాలో చదువుతున్న ఎస్సీ విద్యార్థినీ విద్యార్థుల కొరకు 2026-27 విద్యా సంవత్సరంకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ క్రింద ఇంగ్లీష్ మీడియంలో 1వ తరగతి డే స్కాలర్, 5వ తరగతి రెసిడెన్సియల్ విధానంలో విద్యనభ్యసించుటకు దరఖాస్తులు కోరనైనదని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె.దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2026 ఏప్రిల్ 1 తర్వాత గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారికి ఒక లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాలలో నివసించే వారికి రూ.2 లక్షల లోపు ఉండవలెనని తెలిపారు. కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రం మీ సేవా ద్వారా ధృవీకరణ పత్రం, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనిఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నెం. ఎఫ్3, మొదటి అంతస్తు, కలెక్టరేట్ కాంప్లెక్స్, సూర్యాపేట నందు దరఖాస్తు ఫారాలు పొందవచ్చని పేర్కొన్నారు.పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.ఈ పథకమునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థినీ విద్యార్థుల కుటుంబ సభ్యులలో గతములో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు గానీ, బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద గాని చదువుతున్నట్లయితే ఇప్పుడు దరఖాస్తు చేసుకునుటకు అవకాశం లేదని తెలిపారు.దీనికి సంబంధించిన డ్రా ను కలెక్టరేట్ మీటింగ్ హాల్ నందు జూన్ 10న ఉదయం 11 గంటలకు తీయబడునని తెలిపారు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు.1వ తరగతిలో దరఖాస్తు చేసుకొనుటకు 2020 జూన్ 13 నుండి 2021 జూన్ 12 మధ్య కాలంలో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.



## ఘనంగా కట్టా మమత సత్కార కార్యక్రమం..

## పాల్గొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్ రెడ్డి

**పాశంవారిగూడెం పంచాయతీలో నూతన బాధ్యులకు ఘన సత్కారం**

**గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని వెల్లడి**

**గుర్రంపోడు, జూన్ 3 (జనంసాక్షి)**

గుర్రంపోడు మండల పాశంవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కట్టా మమత గారికి గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆమెకు పూలమాలలు వేసి, శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన నాయకత్వంలో పాశంవారిగూడెం గ్రామం అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కట్టా మమత మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి అందరి సహకారంతో కలిసికట్టుగా ముందుకు సాగుతానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని అభినందనలు తెలిపారు. వారితో పాటు 4వ వార్డు మెంబర్ అందుగుల స్వరణ్, ఆశా వర్కర్ పాశం శ్రీలత, గ్రామ పంచాయతీ వర్కర్ అందుగుల రాములమ్మ, గ్రామ ప్రముఖులు అమరవాది దుర్గయ్య, అందుగుల శ్రీరాములు మరియు పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పచ్చిరొట్ట తో భూసారం పెంచుకోవాలి

**ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు**



**ఎర్రుపాలెం, జూన్ 03 (జనంసాక్షి):** పచ్చి రొట్టె తో భూసారాన్ని పెంచుకొని పంటల దిగుబడులను పెంచుకోవాలని మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనా లను రైతులకు ఏ.ఎం.సి చైర్మన్ ఆధ్వర్యంలో మలుగుమాడు, రాజుపాలెం, సొసైటీలలో సొసైటీ అధ్యక్షులు పలువురు రైతులతో కలిసి పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఏఎంసీ చైర్మన్, బండారు.నరసింహారావు, మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి.సుధాకర్ రెడ్డి, సర్పంచ్లు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, గురిజాల మరియమ్మ, ముక్కర రామకృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ చావా రామకృష్ణ, పీసీసి సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ లు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, కోగంటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దోమందుల నాగేశ్వరావు,మాజీ ఎంపీటీసీ దోమందుల సామేలు, నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, శీలం వెంకట్రామిరెడ్డి, కర్నాటి రామకోటారెడ్డి, కర్నాటి సుధాకర్ రెడ్డి,కోగంటి నాగేశ్వరావు, నున్నా మోహనరావు,కన్నా శ్రీనివాసరావు,దేవరకొండ రాజీవ్ గాంధీ,షేక్ జాన్ బాషా, పురుషోత్తం, బూసిపల్లి తిరుమలరెడ్డి, సీఈఓ లు బొగ్గుల శివారెడ్డి, మోహన్ రావు, ఏఈఓ వంశీకృష్ణ, కుంపటి.శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మమతా కాలేజీ రోడ్ కల్వర్టు త్వరగా పూర్తి చేయాలి - వై విక్రమ్

## నెలలు తరబడి నత్తనడక పనులు - వై విక్రమ్

**ఖమ్మం, (జనంసాక్షి) :**

ఖమ్మం నగరంలోని ప్రధానమైన రహదారి గా వున్న మమతా కాలేజీ రోడ్ లో ఎాః బ్యాంకు వద్ద గత కొన్ని నెలలుగా నత్తనడకగా నడుస్తున్న రోడ్ మీద మెయిన్ కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని అఖఓ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు . బుధవారం అఖఓ పార్టీ ఖానాపూరం హవేలీ మండల కమిటీ ఆధ్వర్యంలో కల్వర్టు పనులను పార్టీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ కొత్తగూడెం, గొల్లగూడం, ముస్తఫా నగర్ తదితర ప్రాంతాలకు ప్రధాన రహదారి గా ఈ రోడ్ వుంది అని, రోజూ వేలాది మంది ప్రయాణికులు ప్రయాణాలు ఈ రహదారిపై జరుగుతున్నాయి అని తెలిపారు. కార్వర్ పనులు రోడ్ కి ఒకవైపు కూడా పూర్తి కాలేదు అని ఆరోపించారు. రెండు వైపులా పూర్తి కావడానికి ఇంకా ఎన్ని నెలలు పడుతుందో అధికారులు, కాంట్రాక్టర్లు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. ప్రధానంగా ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకో సందర్భంలో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని వై విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు దొంగల తిరుపతిరావు, ఎాఐ మీరా సాహిబ్, నాయకులు పోతురాజు బాలరాజు, అమరావతి, చిలకల వెంకటేశ్వర్లు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు



## పట్టణంలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**



పట్టణంలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు నిర్వహించినట్లు పట్టణ ఎస్సై చలికంటి నరేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది హుజూర్ నగర్ మండల కేంద్రంలో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం యువతని, సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సెలూన్ షాప్ దగ్ధం

**తుంగతుర్తి జూన్ 3 (జనంసాక్షి)**



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సెలూన్ షాప్ దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది, గ్రామానికి చెందిన కదునూరి హరీష్ గ్రామ ఎక్స్ రోడ్ వద్ద సెలూన్ షాప్ పెట్టి జీవనం కొన సాగిస్తున్నాడు, ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో షాపులో మంటలు చల రేగి షాప్ మొత్తం అగ్నికి ఆహుతి అయింది, దీంతో తనకు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని తన ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.




## కంటి వైద్య శిబిరంను ప్రారంభించిన సర్పంచ్ గోపి నాయక్

**బీబీనగర్ (జనంసాక్షి):**

బీబీనగర్ మండలం రామునిగుండ్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ బానోతు గోపీ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంను ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తండా వాసులకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కంటి వైద్య శిబిరాని నిర్వహించినట్లు తెలిపారు. హబ్సిగూడలోని ఆనంద్ ఐ ఇన్స్టిట్యూట్ వైద్య బృందం 86 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ఆప్టోమెట్రిస్టులు శిరీష, నవ్య, ఉమ, నాగరాజు, క్యాంప్ కో-ఆర్డినేటర్ యు. పూర్ణచందర్, ఉపసర్పంచ్ బానోతు శ్రావణిశ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి టి. విద్య, వార్డు సభ్యులు బానోతు రావి, భూక్యా సుధాకర్, బానోతు పచ్య, దారావత్ రాజు, జరుపుల లింగం, బానోతు జగ్గు, బానోతు తులసిరాం పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో బోధన.. పిల్లలు మాత్రం ప్రైవేట్ స్కూళ్లలో..!

### "మీ బోధనపై మీకే నమ్మకం లేకుంటే.. ప్రజలు ఎలా నమ్మాలి సార్?"

**భూదాన్ పోచంపల్లి, జూన్ 3(జనంసాక్షి):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెబుతూ భారీ జీతాలు పొందుతున్న కొందరు ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలను మాత్రం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ విద్య గొప్పదని వేదికలపై చెప్పే ఉపాధ్యాయులు, అధికారులు తమ పిల్లల విషయంలో మాత్రం ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పక్కన పెడుతున్నారు అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, మెరుగైన వసతులు ఉన్నాయని ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. అదే వ్యవస్థపై ఉపాధ్యాయులకే నమ్మకం లేకపోవడం విడ్డూరంగా మారింది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించలేని వారు ఇతరుల పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎలా చెప్పగలరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ముందు ఉపాధ్యాయులు, అధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మాటల్లో ప్రభుత్వ విద్య గొప్పదని చెప్పడం కాదు.. చేతల్లో చూపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "ప్రభుత్వ స్కూల్ బాగుందని చెప్పే వారు తమ పిల్లలను అక్కడే చదివిస్తేనే ప్రజలు నమ్ముతారు.. లేదంటే ఇవన్నీ కేవలం ప్రచారాలుగానే మిగిలిపోతాయి" అని స్థానికులు మండిపడుతున్నారు.

## డీజిల్ డ్రమ్‌లు తరలిస్తుండగా టిప్పర్ లోడర్ బోల్తా.. ఇద్దరు కార్మికుల మృతి

**భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (జనంసాక్షి):**



మండలంలోని పిల్లాయిపల్లి గ్రామ సమీపంలో గల శివగంగా అగ్రిగేట్స్ క్రషర్ మిల్ వద్ద మంగళవారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. క్రషర్ మిల్‌కు చెందిన హిందూస్తాన్ వీల్ లోడర్‌పై డీజిల్ డ్రమ్‌లను క్వారీ ప్రాంతానికి తరలిస్తున్న సమయంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లోడర్‌పై ప్రయాణిస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మృతులను జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నిరంజన్ (21), సతీష్ కుమార్ (22)గా గుర్తించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారి వాంగ్మూలాలు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, వాహనం సాంకేతిక పరిస్థితి, డ్రైవర్ నిర్లక్ష్యం, యాజమాన్యం బాధ్యతలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

## సబ్సిడీ పై జనుము,జీలుగు విత్తనాలు

### మండల వ్యవసాయ అధికారి రావుల పాండు

**పి.ఏ.పల్లి,జూన్ 03(జనంసాక్షి )**



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పి.ఏ.పల్లి నందు సబ్సిడీ పై 6 క్వింటాళ్ల జనుములు,80 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రావుల పాండు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుములు 40 కేజీల బస్తా - 3110 మరియు జీలుగు 30 కేజీల బస్తా కి 2450/- కావలసిన రైతులు పట్టా బుక్కు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోని సొసైటీ నందు తీసుకోవాలని తెలిపారు.ఒక్క రైతుకు రెండున్నర ఎకరాలకు ఒక బస్తా చొప్పున,ప్రతి రైతుకు గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే ఇవ్వబడును అని తెలిపారు.ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కొనసాగుతున్న మూడవ విడత దోస్త్ అడ్మిషన్లు

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 3 (జనంసాక్షి)**

డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ మూడవ దశ కొనసాగుతున్నదని ఖమ్మం ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రిజిస్ట్రేషన్లకు ఈనెల 15 చివర తేదీ కావడంతో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వెబ్ ఆప్షన్ల కు 16 వరకు అవకాశం ఉందని వెల్లడించారు.ఇంతకు ముందు రెండు విడతల్లో నమోదు చేసుకోలేని విద్యార్థులు మూడవ విడత లో చేసుకోవచ్చన్నారు కాగా రెండవ విడత లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 5 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇతరవివరాలకుకళాశాల దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్లో సంప్రదించాలని తెలిపారు.

## తల్లంపాడు పశు వైద్యశాల డాక్టర్ గా జగ్గు లాల్ బాధ్యతలు స్వీకరణ

**ఖమ్మం రూరల్, జూన్ 03 (జనంసాక్షి):**



ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు పశు వైద్యశాల నూతన వైద్యాధికారిగా డాక్టర్ గా ఏ.జగ్గు లాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను తల్లంపాడు పశు వైద్యశాలకు నియమించారు. డాక్టర్ జగ్గు లాల్ గత 2018 సంవత్సరం నుంచి 2026 మే నెల వరకు ఎం. వెంకటాయపాలెం పశు వైద్యశాలలో సుమారు ఎనిమిది సంవత్సరాల పాటు సేవలందించారు.తన సేవా కాలంలో పశు వులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మంచి గుర్తింపు పొంది రైతుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, పశు పోషకులు డాక్టర్ జగ్గు లాల్‌కు స్వాగతం పలికి, తల్లంపాడు పరిధి లోని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ విధుల్లో విజయవంతంగా కొనసాగాలని కోరారు.

## అక్రమ మట్టి రవాణాపై పోలీసుల దాడి

### మూడు లారీలు స్వాధీనం..

**భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (జనంసాక్షి):**

మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకం, రవాణాపై ఎస్సై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. దేశ్‌ముఖి గ్రామ సమీపంలోని సర్వే నెం.648/9 ప్రాంతంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వి మూడు లారీల ద్వారా తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విచారణలో ప్రధాన నిందితుడు కనమోని శివశంకర్ (31), దేశ్‌ముఖి గ్రామానికి చెందిన వ్యక్తి, అక్రమంగా మట్టిని తవ్వి విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ కార్యకలాపాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతని ఆదేశాల మేరకు టీ ఎస్ 07 యూఎన్ 2823, టీ ఎస్ 07 యూకే 7847, టీ ఎస్ 07 యూకే 4750 లారీ నెంబర్లను నడుపుతున్న డ్రైవర్లు తంతరపల్లి కుమార్, ఒర్సు గిరి, దాసర్ల పరమేష్‌లు అక్రమ మట్టి రవాణాలో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి మట్టితో లోడ్ చేసిన మూడు లారీలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు.

## నేరేడుచర్లలో అంగన్వాడీ పిల్లలకు యూనిఫారాల పంపిణీ

**నేరేడుచర్ల జూన్ 03(జనంసాక్షి):**

మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డు, చింతబండలో ఉన్న నేరేడుచర్ల-4 అంగన్వాడీ కేంద్రంలో ప్రీ-స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం తరపున అందిన యూనిఫారాలను14వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి సరికొప్పుల (అర్రురి) విజయలక్ష్మి గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి గారు మాట్లాడుతూ, పిల్లలందరూ ఒకే విధమైన యూనిఫారం ధరించడం వల్ల ఎలాంటి భేదభావాలు లేకుండా, ఒత్తిడి లేకుండా విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. చిన్నారుల ప్రాథమిక విద్యాభి వృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

# కాటేపల్లిలో ఘనంగా కాంగ్రెస్ జెండా గద్దె శంకుస్థాపన..

## కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్!

**మోటకొండూరు, జూన్ 03 (జనంసాక్షి):** మండల పరిధిలోని కాటేపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు పార్టీ బలోపేతానికి ముందడుగు వేశాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఆదేశానుసారం, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు శివరాత్రి మత్స్యగిరి ఆధ్వర్యంలో గ్రామంలో నూతన కాంగ్రెస్ జెండా గద్దె శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాటేపల్లి గ్రామ సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ చేసి జెండా గద్దె నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి యువత ఎంతో ఉత్సాహంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల పుష్పలత వెంకటేష్, వార్డు మెంబర్లు గంధమల్ల నరసింహ, గంధమల్ల మధు, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మాధవి, గ్రామ శాఖ అధ్యక్షులు పరమటి రామ్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రహీం, యూత్ కాంగ్రెస్ నాయకులు పచ్చిమట్ల రాజు గౌడ్,



ప్రదీప్, నరేష్, వల్లాల భీమేష్ మరియు గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు కుటుంబానికి రూ.1 లక్ష భీమా చెక్కు అందజేత

**ఖమ్మం, జూన్ 03(జనం సాక్షి)**
ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన రైతు మహిళ యర్రా స్వరూప ఇటీవల మరణించగా, ఆమె కుటుంబానికి ఆర్థిక భరోసాగా సొసైటీ సభ్యత్వ భీమా పథకం కింద రూ.1 లక్ష భీమా చెక్కును ఆమె భర్త యర్రా సీతారామరావుకు సొసైటీ చైర్మన్ తుపాకు యలగొండ స్వామి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతు కుటుంబాలకు అండగా నిలిచేందుకు సహకార సంఘాలు అమలు చేస్తున్న భీమా పథకాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులు సొసైటీ సభ్యత్వం పొందడం ద్వారా ఇటువంటి సంక్షేమ ప్రయోజనాలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రసాద్, సిబ్బంది దీపిక, లక్ష్మయ్య, శ్రీను, జానీమియా, మధు, రమ్య తదితరులు పాల్గొన్నారు. రైతు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ముంపు ప్రాంతాల్లో పర్యటించిన పీపీఏ బృందం

**పోలవరం బ్యాక్ వాటర్తో ముప్పు వాటిల్లే ప్రాంతాల్లో పర్యవేక్షణ**

ముంపుకు గురయ్యే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నట్లు బృందం గుర్తించినట్లు తెలుస్తోంది. పరిశీలన చేసిన బృందంలో పీపీఏ సీఈవో సంజీవ్ వోహ్రా, ఎంఎస్ రఘురాం, సీఈ రమేష్, డైరెక్టర్ సతీష్, డిప్యూటీ డైరెక్టర్లు ప్రవీణ్, రవి, శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎస్ఈ సుబ్రమణ్యప్రసాద్, ఈఈలు వెంకటేశ్వరరావు, మమ్మద్ జాని, డీఈలు శ్రీనివాస్, మధుసూధన్రావు తదితరులు పాల్గొన్నారు.




# అధ్యాపకులో చిరకాల స్వప్నం సహకారం

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 3 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రేకనింగ్ ఆఫ్ సర్వీస్ జీవో నెంబర్ 21 పట్ల తెలంగాణ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరిపింది. సందర్భంగా స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల నందు జిల్లాలోని అధ్యాపకులందరూ సంబరాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా జీవో విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కకి, తెలంగాణ విద్యాశాఖ అధికారిణి శ్రీమతి యోగితారాణా, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీమతి దేవసేనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ జీవోను సాధించుటలో అత్యంత కీలకమైన మరియు ముఖ్యపాత్ర పోషించిన ఎఉఅఉం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నంద్రు గోపి గారి నాయకత్వాన్ని సమర్థిస్తూ వారు చేసిన కృషికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నంద్రు గోపి మాట్లాడుతూ అధ్యాపకుల చిరకాల స్వప్నమైన రేకనింగ్ సర్వీస్ జీవో సాధించడం పట్ల అసోసియేషన్ నిబద్ధతను గుర్తు చేశారు అధ్యాపకుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ అధ్యాపకులకు అండగా ఉంటుందని తమపై నమ్మకం ఉంచిన సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు డాక్టర్ సురేందర్ రెడ్డి నాయకత్వాన్ని కళాశాల అధ్యాపకలు పూర్తి మద్దతును ప్రకటించారు, తమకు సహకరించిన ముఖ్యమంత్రివర్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కళాశాల కమిషనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ మాధవరావు, రాష్ట్ర బాధ్యులు డాక్టర్ వి శాంత కుమార్, జిల్లా బాధ్యులు డాక్టర్ కిరణ్ కుమార్, సూరంపల్లి రాంబాబు డాక్టర్ పి విజయకుమార్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ బూరుగు శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ శ్యామ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ జి వెంకయ్య, డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ కవిత, డాక్టర్ మాధవి డాక్టర్ బిందు శ్రీ , డాక్టర్ శ్యామల, డాక్టర్ శ్రీరామ్ రాకేష్ బి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మంటలను ఆర్పే విధానంపై ప్రజలకు అవగాహన

**మండల కేంద్రంలో అగ్నిమాపక, రెవిన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన**

**మాడుగులపల్లి, జూన్ 3 (జనం సాక్షి )**
మండల కేంద్రంలో అగ్నిప్రమాదాల నివారణ, మంటల అదుపుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, వాటిని ఎలా అదుపు చేయాలో అగ్నిమాపక, రెవిన్యూ అధికారులు మండల ప్రజలకు ప్రత్యక్షంగా చేసి చూపించారు ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ యాదగిరి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు ఆధునిక సాంకేతికతతో కూడిన కార్బన్ డయాక్సైడ్ (అూబి2) సిలిండర్లను ఉపయోగించి మంటలను ఎలా త్వరితగతిన, సురక్షితంగా ఆర్పవచ్చో ఆయన ప్రజలకు వివరించారు తహసీల్దార్ సరోజ పావని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, ఇటువంటి ప్రదర్శనలు ప్రమాద తీవ్రతను తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కత్తుల సైదులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, శ్యామ్, రెవిన్యూ మరియు ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎంపీ చామలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలి

**బీబీనగర్ (జనంసాక్షి):**
ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే తప్పుడు ఆరోపణలను కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వస్తున్న భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి అధిష్టానం గుర్తించి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ మండల నాయకులు సామల ప్రవీణ్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు అనునిత్యం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లడంతో పాటు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ పార్టీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తున్న నాయకుడు కిరణ్ కుమార్ రెడ్డి అని అన్నారు. తన దగ్గరకు వచ్చేకార్యకర్తల కష్టాలను తీరుస్తూ ముందుకు సాగుతున్న వ్యక్తి కిరణ్ కుమార్ రెడ్డి ,అలాంటి వ్యక్తికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినట్లయితే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది కనుక అధిష్టానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.



# కట్టవారిగూడెంలో కరాటే శిక్షణ శిబిరం ముగింపు హాజరైన సర్పంచ్ ప్రమీల చక్రవర్తి

**గుర్రంపోడు: జూన్ 3 (జనంసాక్షి)**
ఈనెల 3వ తేదీన కట్టవారిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా వారి వేసవి కరాటే శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కట్టవారిగూడెం సర్పంచ్ చాడ ప్రమీల చక్రవర్తి విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులకు సమ్మర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థినీ విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యను నేర్పించాలన్న కాంక్షతో ఈ గ్రామ నివాసి అయిన మాస్టర్ కట్ట అయోధ్య రాములు ఈ సంవత్సరం ఇక్కడ వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను చైతన్యపరిచినందుకుగాను ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మునుముందు వారు చేసే కార్యక్రమాల్లో సాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కట్ట వారి గూడెం ఉపసర్పంచ్ పర్సనబోయిన రాధా వెంకన్న వేసవి కరాటే శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తి అయినందుకు గాను మాస్టర్ను మరియు విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. తదుపరి విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. బ్లాక్ బెల్ట్ 7వ డాన్ ఇండియా చీఫ్ ఇన్స్ట్రక్టర్ ఇండియా సీనియర్ ఎగ్జామినర్ నాంపల్లి కనకారావు మాట్లాడుతూ ఈ వేసవి కరాటే శిక్షణ శిబిరం మా ఆధ్వర్యంలో మాస్టర్ కట్ట అయోధ్య రాములు ద్వారా వారి గ్రామంలో నిర్వహించి విజయవంతంగాపూర్తయినందుకు గాను సంతోషంగా ఉందని అన్నారు. అలాగే విద్యార్థిని విద్యార్థులనుఅభినందించారు. షావలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా సీనియర్ ఇన్స్ట్రక్టర్ బ్లాక్ బెల్ట్ 1బబి డాన్ కట్ట అయోధ్య రాములు మాట్లాడుతూ నేను ఏకాగ్రతతో అభ్యసించిన విద్యను అందరికీ నేర్పాలన్న కాంక్షతో ప్రారంభించిన ఈ వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేసినందుకు గాను సంతోషంగా ఉందని అన్నారు. అలాగే గ్రామ పెద్దల ప్రోత్సాహంతో మునుముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నాను అని అన్నారు.



# జూన్ 10లోపు పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలి

## కలెక్టర్. బి చంద్రశేఖర్





**నల్లగొండ ప్రతినిధి,జూన్ 03,(జనంసాక్షి):**
విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అన్ని మరమ్మతు పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ఆర్‌సీఓలు, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బడిబాట కార్యక్రమం ఏర్పాట్లు, ఎన్ ఆర్ జి ఈ యెస్ నిధుల వినియోగం, పాఠశాల భవనాల మరమ్మతు లు, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాల సౌకర్యాలు, కేజీబీవీలలో పెండింగ్ పనులు, విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ, సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు, పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తిచేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాల కల్పన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాంలను అందజేయాలని, వాటి కుట్టు పనులను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించాలని తెలిపారు.సంక్షేమ హాస్టళ్లలో బియ్యం నిల్వలు, వంటశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్, తరగతి గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యుత్, ప్లంబింగ్ వ్యవస్థలను పూర్తిగా తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. పాఠశాలల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు.ప్రతి పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని, జీరో అడ్మిషన్లు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నమోదు సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు.జూన్ 12లోపు విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందించాలని ఆదేశించారు.నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ (ఎఐ) ఆధారిత తరగతులు నిర్వహించాలని, పాఠశాలల లోనే ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రతి విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.తెలంగాణ పబ్లిక్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి దశరథ. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పిడి శేఖర్ రెడ్డి. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐ జె యూ గుర్రంపోడు మండల ఎన్నిక

**గుర్రంపోడు జూన్ 3 (జనంసాక్షి)**
గుర్రంపోడు మండల తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీ యూ డబ్ల్యు జె ఐ జె యూ ) నల్గొండ జిల్లా మహాసభ నకిరేకల్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కమిటీలు, మండల కమిటీలను ఎన్నిక చేశారు గుర్రంపోడు మండల అధ్యక్షునిగా సాక్షి దినపత్రికకు చెందిన పిట్టల గూడెం గ్రామానికి చెందిన చింత రెడ్డి వెంకటేశ్వర రెడ్డి ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కొప్పోలు గ్రామానికి చెందిన కొత్త నాగరాజు( ప్రజావాణి), కార్యదర్శిగా చామలేడు గ్రామానికి చెందిన దాం వేలాద్రిని( మన సాక్షి), కోశాధికారిగా కోప్పోల్ గ్రామానికి చెందిన అయితరాజు నాగరాజు( ప్రజా ప్రతిభ )ని సహాయ కార్యదర్శి గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన పోలేపల్లి శేఖర్( జనం సాక్షి) ని ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పిట్టలగూడెం గ్రామానికి చెందిన పాలడుగు శ్రీధర్( సూర్య) ని కార్యవర్గ సభ్యులుగా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన రావుల వెంకటనారాయణ గౌడ్( తెలంగాణ గళం ) ని కార్యవర్గ సభ్యులుగా పాల్వాయి గ్రామానికి చెందిన బైరెడ్డి రమేష్( మన తెలంగాణ), వెంకటాపురం విష్ణు ( ప్రజా వాయిస్)ను ఎన్నుకున్నారు.

# రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం

**మునుగోడు, జూన్ 3, (జనం సాక్షి)**
రైతులకు ప్రభుత్వ పథకాలు, డిజిటల్ సేవలు ,సుస్థిర వ్యవసాయ పద్ధతులపై బుధవారం మునుగోడు మండల పరిధిలోని గ్రామం రైతు వేదిక లో వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏ ఈ ఓ మాధగోని నరసింహ గౌడ్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, ప్రస్తుతం జరుగుతున్న 'ఫార్మర్ రిజిస్ట్రీ' ప్రక్రియ , దాని ప్రయోజనాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎరువుల బుకింగ్ తో ఎరువులను సులభంగా పొందవచ్చునీ, రైతులు మొబైల్ యాప్స్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు.భూమి యొక్క ఉత్పాదకతను కాపాడుకోవడానికి రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని అధికారులు కోరారు. పప్పుధాన్యాలు, పెసర, మినుము వంటి పంటలను సాగు చేయడం ద్వారా భూమి సహజంగానే సారవంతం అవుతుందని నిపుణులు వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, ఆ నివేదికల అనుగుణంగానే ఎరువులను వాడుకోవాలని స్పష్టం చేశారు.జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులు వేసి, అవి పూత దశకు వచ్చిన తర్వాత భూమిలోనే కలియ దున్నడం వల్ల భూసారం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.రాబోయే సీజన్ కోసం పత్తి విత్తనాలను కొనుగోలు చేసే ముందు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గోవర్ధన్, గ్రామ కార్యదర్శి వెంకన్న, రైతులు దాసరి సత్యనారాయణ, లింగస్వామి, జంగయ్య, తిరుమలేష్, శేఖర్, దోటి వెంకన్న, నరసింహ, మహారాజు, తదితరులు పాల్గొన్నారు




# టీయూడబ్ల్యూజే (ఐజేయు) మాడుగులపల్లి మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవం

### మండల అధ్యక్షుడిగా షేక్ రసూల్, ప్రధాన కార్యదర్శిగా దర్శనం రాంబాబు

### రాష్ట్ర, జిల్లా నాయకత్వాల సమక్షంలో ప్రకటన

**మాడుగులపల్లి, జూన్ 03 ( జనం సాక్షి ):**
మాడుగులపల్లి మండల జర్నలిజం రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ మాడుగులపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో బుధవారం ఘనంగా నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా మహాసభల వేదికగా ఈ నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించి, నూతన బాధ్యుల వివరాలను వెల్లడించారు మాడుగులపల్లి మండల అధ్యక్షుడిగా షేక్ రసూల్, మండల ప్రధాన కార్యదర్శిగా దర్శనం రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించి, నూతన సారథులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కార్యదర్శి షేక్ రసూల్, దర్శనం రాంబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తమ కమిటీ పనిచేస్తుందని స్పష్టం చేశారు ఐజేయు సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, విలేకరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు ముఖ్యంగా కాలాతీతమవుతున్న జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, యూనియన్ అండదండలతో ప్రతి జర్నలిస్టుకు పూర్తి భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు మండల నూతన సారథులుగా ఎన్నికైన షేక్ రసూల్, దర్శనం రాంబాబులను జిల్లా, మండల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, పత్రికా విలేకరులు గంట రవి, చిట్యాల సైదులు, నాగరాజు, రమేష్, తిరుమలేష్, సురేందర్, శ్రీనివాస్, రాజు, భరత్, శ్రీను,సైదులు, అఫ్జల్, రామకృష్ణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకలు

**ఆలేరు జూన్ 3 జనంసాక్షి**




యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో యువభారత్ జిల్లా సౌజన్యంతో ప్రెస్ క్లబ్ ఆవరణంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకలను ప్రిన్స్ క్లబ్ అధ్యక్షులు పూల నాగయ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ స్కూల్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో విద్యార్థిని యువజనలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సైకిల్ తొక్కారు అనంతరం వారు సైకిల్ తొక్కడం వల్ల మాట్లాడుతూ మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ ఉంటుందని నినాదాలు చేస్తూ ఊరేగించారు. సైకిల్ తొక్కడం వల్ల చక్కెర వ్యాధి గుండె జబ్బులు ఇతర రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో దోహదపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జు అశోక్, పత్తి రాజు, కటకం హరినాదు, చంద్రకుమార్ రాహుల్ తేజ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలి..

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే చందు ప్రాణాలు కోల్పోయాడని, ఈ ప్రమాదానికి కారణమైన బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.చేతికంది వచ్చిన కొడుకు కళ్ల ముందే కరెంట్ షాక్‌తో చనిపోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. బాధితుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది.